ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 05.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి మొదటి సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

2. జీహెచ్ఎంసీ పరిధిలోని బస్తీల్లో వీధి దీపాలు, డ్రైనేజీ పూడికతీత వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు.

3. నల్గొండలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.

4. ఇవాళ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా వాంఖేడే స్టేడియంలో సెమీఫైనల్ పోరులో భారత, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి.

<u>**రాజ్యసభ-నామినేషన్లు**</u>

తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న సింఘ్వీ పేరును అధిష్ఠానం ముందే ఖరారు చేయగా, రెండో స్థానం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుబట్టడంతో వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. అందరితో సత్సంబంధాలు ఉన్న నరేందర్ రెడ్డి పేరుపై ఎవరూ అభ్యంతరం తెలపకపోవడంతో సీఎం ప్రతిపాదనకే ప్రాధాన్యం లభించిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మొదటి స్థానానికి సింఘ్వీ ఎన్నిక లాంఛనమే అయినప్పటికీ, రెండో స్థానానికి అవసరమైన

పూర్తి మెజార్టీ కాంగ్రెస్‌కు లేకపోవడంతో ఎంఐఎం మద్దతు కీలకం కానుంది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని పోటీకి దించితే ఎన్నిక అనివార్యమవుతుంది, లేని పక్షంలో రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకోనుంది. ప్రస్తుతం అందరి దృష్టి ప్రతిపక్షాల తదుపరి అడుగుపైనే ఉంది.

డెస్క్

**వేం నరేందర్ రెడ్డి**

రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ అసెంబ్లీ ప్రాంగణంలో మాట్లాడారు. రెండోసారి అవకాశం దక్కడంపై హర్షం వ్యక్తం చేసిన సింఘ్వీ, తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, తెలంగాణ ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడతానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**<u>బైట్ ... అభిషేక్ మను సింఘ్వీ</u>**

తనకు ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్టానానికి, పార్టీ పెద్దలకు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**<u>బైట్ ... వేం నరేందర్ రెడ్డి</u>**

డెస్క్

**కిషన్ రెడ్డి**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సనత్‌నగర్ నియోజకవర్గంలోని చాచా నెహ్రూ నగర్ బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వల్ల బస్తీల్లో వీధి దీపాలు, డ్రైనేజీ పూడికతీత వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షణలోని మున్సిపల్ శాఖ తక్షణమే

స్పందించి వర్షపు నీటి కాలువల పునరుద్ధరణ చేపట్టాలని కోరారు. నగరంలో పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి వినియోగం యువతను నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మూసీ ప్రక్షాళన పేరుతో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని, గాంధీ విగ్రహం ఏర్పాటు నెపంతో సామాన్యులను నిరాశ్రయులను చేయకూడదని హితవు పలికారు. పేదల ఇళ్లకు నష్టం కలగకుండా శాస్త్రీయ ప్రణాళికతో మూసీ అభివృద్ధి చేపట్టాలని కేంద్ర మంత్రి ప్రభుత్వాన్ని కోరారు.

డెస్క్/పిటిసి, హైదారాబాద్

**రేవంత్ రెడ్డి**

ఢిల్లీ పర్యటన ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. దేశ రాజధానిలో కాంగ్రెస్ అధిష్టానంతో రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చలు జరిపిన అనంతరం ఆయన శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు బయలుదేరి వెళ్లారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరవుతున్న ఈ వేడుకలో ముఖ్యమంత్రి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు.

డెస్క్

**కరీంనగర్ కలెక్టర్**

కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కలెక్టరేట్ నుంచి 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ పథకంపై టీఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో 16 మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటిపై

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చని అదనపు కలెక్టర్ వివరించారు.

పిటిసి, కరీంనగర్

**ఇన్‌స్పైర్ అవార్డులు**

భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అందించే 2025-26 సంవత్సరపు ఇన్‌స్పైర్ అవార్డులకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 105 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 336 మంది ఎంపిక కాగా, అందులో ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. ఈ ఏడాది జిల్లా నుండి మొత్తం 900 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందగా, గత ఏడాది కూడా 121 మంది విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపికయ్యారు.

పిటిసి, ఆసిఫాబాద్

**సంగారెడ్డి**

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మహీంద్రా & మహీంద్రా తన జహీరాబాద్ ట్రాక్టర్ల తయారీ యూనిట్‌లో ఉత్పత్తి విస్తరణలో భాగంగా సంగారెడ్డి లో భారీ నియామక ప్రక్రియను చేపట్టింది. ఐటీఐ ట్రేడ్స్, మెషినింగ్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ వంటి వివిధ సాంకేతిక విభాగాల్లో మొత్తం 800 పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ నియామకాల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తూ, అభ్యర్థులు సులభంగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

పీటీసీ, సంగారెడ్డి

**టీ20 ప్రపంచకప్**

ముంబైలోని ప్రతిష్ఠాత్మక వాంఖడే స్టేడియం వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో భారత్, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు ఓ మోస్తరు ప్రదర్శనతో సెమీస్‌కు చేరినప్పటికీ, సంజు శాంసన్

ఫామ్‌లోకి రావడం జట్టుకు కలిసొచ్చే అంశం. బ్యాటింగ్‌లో అభిషేక్, ఇషాన్ నుండి భారీ ఇన్నింగ్స్ ఆశిస్తుండగా, బౌలింగ్‌లో బుమ్రా నిలకడగా రాణిస్తున్నా హార్దిక్, అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది. స్పిన్నర్లు అక్షర్, వరుణ్ చక్రవర్తి రాణించడం భారత్‌కు అత్యవసరం. మరోవైపు హ్యారీ బ్రూక్ సారథ్యంలోని ఇంగ్లాండ్ వరుస విజయాలతో జోరు మీదుంది

ఎన్.ఎస్.డి

**"ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"**

నల్గొండ జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు మొత్తం 99 రోజుల పాటు కొనసాగే ఈ బృహత్తర కార్యక్రమంపై జిల్లా కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న నల్గొండలో జరగనున్న ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

పిటిసి, నల్గొండ

**క్రీడా పోటీలు - సిరిసిల్ల**

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో వేములవాడ మండలం అగ్రహారంలోని జేఎన్టీయూ మైదానంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, షార్ట్ పుట్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు దొంతరవేణి హరీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన క్రీడాకారులు అర్హులని పేర్కొంటూ, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**కలెక్టర్ - తనిఖీ**

సూర్యాపేట జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రతి గురుకులంలో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా ప్రమాణాలు, వసతులు మెరుగుపరచాలని సూచిస్తూ, విద్యార్థుల విజ్ఞప్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

పిటిసి, సూర్యాపేట

**దరఖాస్తులు**

మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కాయాకింగ్, రోయింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్ శిక్షణ కోసం ఎత్తు, బరువు, వివిధ శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఆసక్తి గల గిరిజన బాలబాలికలు తమ విద్యా, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో మార్చి 12లోగా మెదక్ కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారిణి నీలిమ తెలిపారు.

పిటిసి, మెదక్

**బ్రహ్మోత్సవాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న శివార్చన వేదికపై స్వామివారి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల